# ధర్మలోగిలి

-రావి ఎన్- అవధాని

ఆకాశం మేఘావృతమై చిన్న చినుకులు పడనారంభించేయి. ధర్మయ్య రిక్షా టాపు వేసి సీటు మీద కూర్చున్నాడు. సీటుమీదకు జల్లు కొట్టకుండా సైడు కర్టెన్లు వేసేడు. ప్లాస్టిక్ రెయిన్ కోటు తీసి వేసుకొని తలకి టోపీ పెట్టుకున్నాడు.

''యింకో సిటం సూసి బేరం తగిలినా నేకున్నా ఎల్లిపోవాల! సీకట్ల ఎల్తే లతమ్మ తగువెట్టుకుంటాది! అసలు రిక్సాబండి బాడుక్కి యెయ్యోద్దు యింటి కాడ కూకో మంటాది.''

''పెందిల ఆదెమ్మకి కంటాపరేసను పూర్ల ఆసుపత్త్రిర్ల యిసాపట్నం డాట్టరు బాబు నేస్తరు. ఆపరేసనంతే దిగులెట్టీ సుగుంది! ఎర్రిబాగుల్ది! కాదేటిమరి! యింతొరకూ సూది మందు కూడ ఏసుకోనేదు! అట్టాంటిది ఆపరేసనంతే దిగులు గాదేటి? అడలిపోదూ మరి?'' అనుకున్నాడు.

ఒక చేత్తో సూట్‌కేస్, ఒక చేత్తో ఎయిర్‌బేగ్ పట్టుకొని తొందరగా అడుగులు వేసుకొంటూ ఒక అమ్మాయి ధర్మయ్య రిక్షా వద్దకు వచ్చింది. ఆ అమ్మాయికి సుమారు పాతిక సంవత్సరాల వయస్సుంటుంది. పంజాబీడ్రస్సు వేసుకుంది.

''రాంవరం వెళ్లాలి! రిక్షా కడతావా?'' అంది.

''కడతాను!'' అని ఆమె చేతిలోని సూట్‌కేసు, బేగూ అందుకొని రిక్షాలో వుంచి ''కూకోండమ్మా!'' అన్నాడు.

''ఎంతో చెప్పు. ఆనక పేచీ వుండదు.''

''తవకు తోచినంతివ్వండమ్మా! నానూ అటు దుక్కే ఎల్లాలి''

ఆ అమ్మాయి ధర్మయ్య వేపొకమారు చూసి నెమ్మదస్తుడేనని నమ్మకం కుదరడంతో మరేమీ మాట్లాడకుండా రిక్షాలో కూర్చుంది.

ధర్మయ్యది సొంత రిక్షా. దానిని ఎప్పుడూ ఎంతో నీట్‌గా వుంచుతాడు. రిక్షాకి అంటిన దుమ్ము వెంట వెంటనే క్లీన్ చేస్తాడు.

రాంవరం గ్రామం పట్టణంకి నాలుగు కిలోమీటర్ల దూరం వుండేది పూర్వం. అయితే యిప్పుడు పట్టణం రాంవరం గ్రామం వైపు మూడు కిలోమీటర్లు పెరిగింది. ఇంకా పెరుగుతోంది. రాంవరం నేషనల్ హైవేప్రక్కన వుంది. అది పది గ్రామాలకి కూడలి.

రాంవరం హాస్పటల్ వద్ద రిక్షా ఆపించి దిగి ఆ అమ్మాయి ధర్మయ్య చేతిలో పదిహేను రూపాయలు పెట్టి, తన సూట్‌కేసూ, బేగ్ తీసుకొని హాస్పటల్ లోనికి వెళ్లింది.

ధర్మయ్య రిక్షా తొక్కుకుంటూ గ్రామంలో తన యింటివేపు బయల్దేరాడు.

రిక్షా అల్లంత దూరంలో కనిపించగానే ''తాతయ్యా!'' అంటూ రిక్షా వద్దకు పరుగు పరుగున వచ్చేడు ఐదేళ్ళ కృష్ణప్రసాద్.

ధర్మయ్య రిక్షా ఆపి కుర్రాడిని ఎత్తుకొని రిక్షాలో కూర్చోబెట్టి యింటికి తీసుకొని వచ్చేడు. రిక్షా షెడ్‌లో వుంచి కృష్ణప్రసాద్‌ని రిక్షాలోంచి దించి చొక్కా జేబులోంచి పాలకోవా పేకెట్ తీసి కుర్రాడిచేతిలో వుంచేడు. వాడు యింటిలోకి పరుగుతీసేడు.

ధర్మయ్య రెయిన్ కోటూ, టోపీ తీసి నీటిని దులిపి వాటిని దండెం మీద ఆరవేసేడు. గుమ్మంలో కూర్చున్న భార్యను పలకరించి స్నానానికి పెరట్లోకి వెళ్లేడు.

చీకటి పడకుండా భర్త తొందరగా యింటికి వచ్చినందుకు ఆదిలక్ష్మి సంతోషించింది.

''కిస్టయ్యా! అమ్మ రానేదా?'' అని అడిగింది.

''లేదు అమ్మమ్మా!'' అన్నాడు కృష్ణప్రసాద్ స్కూలు బేగ్ ముందు కూర్చుని హోంవర్క్ చేస్తూ.

''యిదే దరమయ్యగోరి నోగిలి!'' అన్న మాటలు విని-

''ఎవురది?'' అంది ఆదిలక్ష్మి.

''నానే పెద్దమ్మా! ఎంకటేశాన్ని. అమ్మినాయుడి బొట్టిడ్ని! తాతకోసం ఎవురో వొచ్చినారు'' అంటూ వాడు సూటుకేసు వరండాలో వుంచేడు. వెంకటేశానికి 12 ఏళ్లు. వాడి వెనుక వస్తున్న మంజుల ఆ యింటిని ఓమారు పరిశీలించింది. యింటి ముందు విశాలమైన వాకిలి వుంది. దక్షిణం వేపు కాంపౌండు వాల్‌కి ఒక షెడ్డుంది. పూర్వం అందులో పశువులు, వ్యవసాయ పనిముట్లుండేవి. యిప్పుడందులో ఒక రిక్షామాత్రమే వుంది.

రెండుపోర్షన్ల డాబా యిల్లు. రెండు పోర్షన్లూ కలుపుతూ పదడుగుల వెడల్పుగల వరండా వుంది. రెండు పోర్షన్ల గుమ్మాలముందూ మెట్లున్నాయి. వరండాలో ఒక ప్రక్క ధాన్యం బస్తాలు వున్నాయి. వరండాలో మధ్యన ఒక పడక కుర్చీ, దానికి చెరొక ప్రక్క రెండేసి కర్ర కుర్చీలున్నాయి. ఒక వేపు మెట్లమీద ఆదిలక్ష్మి కూర్చుంది. ఆవిడ వయస్సు ఏభైపైనే వుంటుంది. ముఖంలో మంచి కళ వుంది. సాదా నేత చీర కట్టుకుంది.

''వొరండాలో కూకోబెట్టరా ఎంకటేశూ! అని చెప్పి-

''కిస్టయ్యా! వొరండాలో నైటేసి తాతయ్యకు సెప్పిరా'' అంది ఆదిలక్ష్మి.

కృష్ణప్రసాద్ ఆవిడ చెప్పిన పనులు చేసొచ్చేడు.

''పెద్దమ్మా! నా నెల్తన్నాను'' అన్నాడు వెంకటేశు.

''కిస్టయ్యా! ఆడిసేతల తిండానికేటైనా యెట్టు!'' అంది.

కిటికీలోవున్న ప్లాస్టిక్ డబ్బాలోంచి రెండు పిడికెళ్లు మరమరాలు తీసి వాడికిచ్చేడు. వెంకటేశు సంతోషంగా వెళ్లిపోయేడు.

పిల్లలెవరు యింటికొచ్చినా వాళ్ల చేతుల్లో తినడానికేదైనా పెట్టందే పంపించదు ఆదిలక్ష్మి.

ధర్మయ్య స్నానం చేసి పంచ, చొక్కా వేసుకొని బయటకు వచ్చేడు. తను పట్టణం నుంచి రిక్షాలో తీసుకొచ్చిన అమ్మాయిని వరండాలో చూసి ఆశ్చర్యపోయేడు.

మంజుల కూడా అతనిని చూసి ఆశ్చర్యపోయి ''ధర్మయ్యగారంటే...'' అంది.

''నానేనమ్మా! సెప్పండి!''

''నమస్కారం! నేను..నాపేరు మంజుల. నన్ను ఈ వూరు డాక్టర్‌గా వేసేరు. హాస్పటల్ డాక్టరు యిల్లు కాళీ చెయ్యలేదుట. తాళం వేసుకొని సెలవు పెట్టి వెళ్లిపోయేరుట. రేపు ఉదయం కంటి ఆపరేషన్స్ లయన్స్‌క్లబ్ వాళ్లు ఏర్పాటు చేసేరు. వైజాగ్ నుండి టీమ్ వస్తున్నారు. నన్ను వెంటనే డ్యూటీలో చేరమని ఆర్డరు వేసేరు. ఎక్కడుండాలో తెలియక తికమక పడుతూంటే యిక్కడ ధర్మయ్యగారి లోగిలుంది, వెళ్లమని చెప్పేరు. అందుకు వచ్చేను'' అంది.

''దండాలమ్మా! తవకి యిబ్బంది నేదనుకుంటే యీడ తవరు ఎన్నిదినాలైనా వుండొచ్చమ్మా!''

''ఎంత సేపైంది బాబాయి నువ్వొచ్చి? టీ ఫ్లాస్క్‌లో వుంచేను తాగేవా? పంచదార కోటా వచ్చిందంటే విడిపించడానికి వెళ్లేను. యీవిడ ఎవరూ?'' అంది లత, మంజులను ఆమె ప్రక్కనే వున్న సూట్‌కేసుని చూసి ఆశ్చర్యపడి.

లత కృష్ణప్రసాద్ తల్లి. వయస్సు సుమారు మూడు పదులు. ఆ వూర్లో స్కూలు టీచరు.

''మనూరి ఆసుపత్తిరి కొత్తడాట్టరమ్మ! డాట్టరిల్లుకాలీ సెయ్యనేదుట, మనింట వుండానికొచ్చినారు. లోనికి దీసుకెల్లి ఏటిగావోలో సూడు తల్లీ!'' అన్నాడు ధర్మయ్య.

''రండి!'' అంటూ తనుంటున్న పోర్షన్ తలుపులు తెరిచింది.

ధర్మయ్య సూట్‌కేసు తీసుకోబోయేడు.

''నువ్వుండు బాబాయ్! నేను తీసుకెళ్తాను'' అని సూట్‌కేస్ తీసుకొని లోనికి మంజులతో వెళ్లింది. మంజుల ఆమెకు తన వివరాలు చెప్పింది.

మూడు గదుల పోర్షన్ అది. సామానులన్నీ చాలా నీట్‌గా అమర్చబడి వున్నాయి. వీధిగుమ్మంలోవలే పెరటి వేపు కూడా రెండు పోర్షన్లనూ కలుపుతూ వరండా, మెట్లూ వున్నాయి. విశాలమైన పెరడు. అందులో గిలకబావి. పెరట్లో అరటి, జామ, మామిడి, కొబ్బరిమొక్కలు, కూరగాయల పాదులు వున్నాయి. యింటి చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ వుంది.

ఫ్లాస్క్‌లో టీ రెండు గ్లాసుల్లోపోసి ఒకటి మంజులకిచ్చింది. యింకొకటి వరండాలో పడక కుర్చీలో కూర్చున్న ధర్మయ్యకిచ్చింది.

''అమ్మా! పట్నంల కూరకాయలొట్టుగొచ్చిన'' అంటూ

సంచీ అందించేడు లతకు.

గుమ్మం దగ్గరే నిల్చుని తన వేపు చూస్తున్న కృష్ణప్రసాద్‌ని ''యిలారా బాబూ! నీపేరేంటి? ఏం చదువుతున్నావ్?'' అంది మంజుల.

వాడు ఆమె దగ్గరకు వెళ్లి ''కృష్ణప్రసాద్, సెకెండ్‌క్లాస్. నాకు చాలా పేర్లున్నాయి! అమ్మమ్మ 'కిస్టయ్యా' అని తాతయ్య 'కిష్నా' అని అమ్మ కిట్టూ అని, స్కూల్లో 'కృష్ణప్రసాద్' అని పిలుస్తారు.''

''ఏ స్కూల్లో చదువుతున్నావ్!'' అంది వాడిని దగ్గరగా తీసుకొని

''భారతీ కాన్వెంట్! మా స్కూలు బోల్డు దూరం! పట్నంలో వుంది. తాతయ్య మరి నన్ను రోజూ రిక్షాలో తీసుకెళ్తారు'' అన్నాడు.

''మీకు హాట్ వాటర్ బాత్‌రూంలో పెట్టేను. వెళ్లిస్నానం చేసి రండి. ప్రయాణ బడలిక తీరుతుంది'' అంది లత.

మంజుల స్నానం చేసి నైటీ వేసుకొని వచ్చింది.

''మీకు చాలా శ్రమ కలిగిస్తున్నాను.'' అంది.

''నాకు శ్రమేం లేదండీ! అలా మీరేం మొహమాటపడకండి'' అంది లత నవ్వుతూ.

''మిమ్మల్ని అక్కా అని పిలవమంది అమ్మ! అలా పిలవచ్చా'' అన్నాడు కృష్ణప్రసాద్.

''అలాగే పిలువు తమ్ముడూ!'' అంది మంజుల.

వాడి ముఖం సంతోషంతో వికసించింది. వాడా విషయం తాతయ్యకు, అమ్మమ్మకూ చెప్పేడు.

లత వంట చేస్తూంటే మంజుల వెళ్లి ''నన్ను హెల్ప్ చెయ్యమంటారా!'' అని అడిగింది.

''ఏమీ వద్దు. మీరలా కూర్చోండి'' అంటూ పీటవాల్చింది.


''ధర్మయ్యగారు మీ చిన్నాన్నగారా?'' అని అడిగింది మంజుల.

ఆమె ప్రశ్నకు లత చిరునవ్వు నవ్వి.

''కాదండీ! వారికీ, మాకూ ఎలాంటి రక్త సంబంధం లేదు. కాస్ట్ కూడా వేరు. నేనూ, మావారూ పట్నంలో టీచర్స్‌గా పనిచేస్తూండే వాళ్లం. మావాడికి మూడో ఏట కాన్వెంట్‌లో వేసేం వాడిని. యింగ్లీషు మీడియంలో చదివించాలని మావారి కోరిక! అయితే వారు హార్ట్ ఎటేక్ వచ్చిపోయేరు. మాకు చెప్పుకోదగ్గ బంధువులు లేరు. నన్ను యీ వూరు ఎలిమెంటరీ స్కూలు హెచ్.ఎమ్.గా వేసేరు. నేను పట్నం నుంచి రోజూ వచ్చి వెళ్లడం శ్రమ. మావాడు మరి పట్నంలో చదువుతున్నాడు. ఏం చెయ్యాలో దిక్కుతోచని తరుణంలో మాకు యీ ధర్మయ్యగారింట ఆశ్రయం లభించింది. యీ దంపతులు నన్ను వారి సొంత కూతుర్లా చూసుకుంటున్నారు. కన్నకూతురు కంటే ఎక్కువగా అభిమానిస్తున్నారు. మావాడిని రోజూ స్కూలుకి రిక్షాలో తీసుకెళ్లి తీసుకొస్తున్నారు ధర్మయ్యగారు. యింటికి అద్దె పుచ్చుకోరు. పైగా బియ్యం కొననివ్వరు. పంట ధాన్యం! వాడుకోమని యిస్తున్నారు. స్కూలు కూడా ఆయన కట్టించి యిచ్చిందేనట!''

ధర్మయ్యగారి విశాలహృదయాన్ని, దానగుణాన్ని కొనియాడి ''మరి వారికి సంతానం లేదా!'' అంది కుతూహలంగా మంజుల.

లత ఆమె ప్రశ్నకు పేలవంగా నవ్వి ''లేకేం! యిద్దరు కొడుకులున్నారు. యిద్దరూ యింజనీర్లే, పెద్దకొడుకు విజయవాడలోనూ, రెండోకొడుకు కాకినాడలోనూ జాబ్ చేస్తున్నారు. వాళ్లు తమకు నచ్చిన అమ్మాయిలను వివాహం చేసుకొని వెళ్లిపోయేరు.''



''కొడుకులిద్దరూ అంతమంచి పొజిషన్‌లో వుండి వీళ్లను పట్టించుకోవడం లేదా! కనీసం వీరికి డబ్బు కూడా పంపరా?'' అంది ఆశ్చర్యంగా.

''వాళ్ళు డబ్బు పంపక్కర్లేదమ్మా! యీ ముసలివారిని ఒక పర్యాయం వచ్చి చూసి యోగ క్షేమాలు తెలుసుకుంటే చాలు. యీ వయసులో వారు ఎంతో సంతోషించేవారు. పోనీ వారు తమ దారి తాము చూసుకొని వెళ్లిపోయినా బావుండేది! పోతూ పోతూ వారు వీరి చేతులు విరిచి చక్కాపోయేరు.''

''అంత దుర్మార్గులా! కాస్త వివరంగా చెప్పండి!''

''యీవూరి వారికేగాక చుట్టుప్రక్కల పది పన్నెండు గ్రామాల వారికి యీ దంపతులు దైవసమానులు. ఏ యింట శుభకార్యం జరిగినా వీరు క్రొత్తదంపతులనాశీర్వదించి బట్టలు యిస్తారు. పేదవారికి తాళిబొట్టు, ఖర్చులకు డబ్బు యిస్తారు. యీ గ్రామం పదిగ్రామాలకు సెంటరు. అంతేకాక రోడ్డుప్రక్కనే వుంది. యిక్కడ హాస్పటల్ కడితే పది గ్రామాలకు వైద్య సదుపాయం అందుతుందని ప్రభుత్వం వారు సంకల్పించేరు. కాని పని జరగలేదు. యీ విషయం తెలుసుకున్న ధర్మయ్యగారు హాస్పటల్ కట్టడానికి, స్టాఫ్ యిళ్లు కట్టడానికి 5 ఎకరాల స్థలం రాసిచ్చేరు. అంతేకాదు లక్ష రూపాయల విరాళం ప్రకటించేరు. స్థలం దొరకగానే హాస్పటల్ పని ప్రారంభమైంది. ధర్మయ్యగారి దాన గుణాన్ని దినపత్రికల వారు పొగుడుతూ వార్తలు వేసేరు. ధర్మయ్యగారి కొడుకులిద్దరూ న్యూస్ చదివి వచ్చేరు.

''నీ యిష్టానుసారం దానధర్మాలు చెయ్యడానికి యీ ఆస్తి నీ సంపాదనేం కాదు. మా తాత ముత్తాతలు సంపాదించినది. మా భాగం వెంటనే పంచమని పంచాయితీ పెట్టించేరు. పాతిక ఎకరాల పొలం మూడు భాగాలు, యిల్లు వొదిలినందుకు కొడుకులిద్దరూ తమకు 17 ఎకరాల పొలం రాయించుకున్నారు. తల్లీతండ్రికీ వొదిలిన ఎనిమిది ఎకరాలలోనే తమ తండ్రి హాస్పటల్‌కి డొనేషన్ క్రింద యిచ్చిన 5 ఎకరాలూ వుందని అన్నారు. ధర్మయ్యగారు మారుమాట్లాడకుండా కొడుకులు కోరిన విధంగా భాగం పంచి యిచ్చేరు. భర్త యిస్తానన్న డొనేషన్ లక్ష రూపాయలకు గాను ఆదిలక్ష్మి ఆమెకు పుట్టింటి వారిచ్చిన నగలు లక్ష రూపాయల విలువ చేసేవి యిచ్చేరు. అత్తగారు తమకు నగలు యివ్వలేదని కోడళ్లు ఆమెను దూషించి వెళ్లిపోయేరు. కొడుకులిద్దరూ తమ పొలాలు అమ్ముకొని సొమ్ము తీసుకొని వెళ్లిపోయేరు. పాతికేళ్లు గడిచినా వారు వీరి పూసెత్తలేదు.''

56వ పేజీ చూడండి

31వ పేజీ తరువాయి

"కొడుకులు చేసిన పనికి ధర్మయ్యగారు ఏమాత్రం దిగులు చెందలేదు. తనకు మిగిలిన మూడు ఎకరాల్లోనే వ్యవసాయం చేస్తూ ఎప్పటి లాగే దానధర్మాలు చేస్తున్నారు. వీరి పొలం ప్రక్కనే అమ్మినాయుడి పొలం వుంది పది ఎకరాలు. అమ్మినాయుడు వీరికి దూరపుబంధువు. మూడు ఎకరాల కోసం ఎందుకు నీకు ప్రత్యేక శ్రమ. మా పొలంతోపాటు దానిని నేనే సాగుచేసి అది పండినా ఎండినా ఏటా నీకు 30 బస్తాల ధాన్యం యిస్తాను అని అమ్మినాయుడు యీయన చేత పొలం పని మానిపించేడు. యీయన తన బండి, ఎడ్లు వ్యవసాయ పనిముట్లు, పాడిపశువులు అమ్మినాయుడికిచ్చి వేసేడు. అతను వీరికి రోజూ రెండు లీటర్ల పాలు పంపుతున్నాడు."

"ధర్మయ్యగారు పనిలేకుండా కూర్చోలేక రిక్షాకొని పట్నంలో త్రిప్పుతూ రోజుకి 70-80 రూపాయలు సంపాదిస్తూ దానిని దాన ధర్మాలకు వినియోగిస్తున్నారు. అయితే నేను వచ్చిన తరువాత పెద్దవయస్సులో అంతలా రిక్షా తొక్కడం ఒంటికి మంచిది కాదని చాలావరకూ మాన్పించేను. యిప్పుడు మావాడినీ మరి నలుగురు పిల్లల్నీ పట్నం కాన్వెంట్‌కి తీసుకొని వెళ్లి తీసుకొస్తున్నారు. వారు నెలకి నాలుగువందలు యిస్తారు. ఆ డబ్బు వారిని దానధర్మాల కొరకు ఖర్చుపెట్టుకోమన్నాను. ఏదో యిప్పటి వరకూ నా మాట వింటున్నారు."

"అన్నార్తులకు ధర్మయ్యగారి లోగిలి ధర్మలోగిలి! ఆకలి అన్నవారికి వారు ఏ సమయంలో వచ్చినా వంట చేసి కడుపు నిండా భోజనం పెట్టి పంపేదానశీలి ఆదిలక్ష్మి. నాలుగు మాసాలై ఆవిడకు కేట్రాక్ట్ వచ్చి దృష్టి సరిగా లేకపోవడంతో ఆవిడ తన చేతులు విరిగిపోయేయని విలవిల లాడిపోతున్నారు. వారికి నేనే వంట చేసిపెడుతున్నాను." అంది లత.

వారి గాథ మంజుల మనస్సుని పూర్తిగా కలిచి వేసింది.

వంటపని పూర్తిచేసి మంజులను తీసుకొని వరండాలోనికి వచ్చింది లత. ధర్మయ్య పడక కుర్చీలో పడుకొని వున్నాడు. కృష్ణప్రసాద్ ఆయన పొట్టమీద కూర్చుని కబుర్లు చెప్తున్నాడు.

"కిట్టూ! అలా తాతయ్య పొట్టమీద ఎక్కి కుమ్మొచ్చా? దిగు క్రిందకు" అంది లత.

"నేదమ్మా! ఆడి తప్పేం నేదు. నానే కూకోబెట్టుకున్నా" అన్నాడు.

"వాడి మీద యీగకూడా వాలనివ్వవు కదా బాబాయ్" అంది నవ్వుతూ.

లత, మంజుల వెళ్లి ఆదిలక్ష్మి చెంత కూర్చున్నారు.

"వొంట పైనైందా తల్లీ!" అంది ఆదిలక్ష్మి కళ్లు తెరచి.

"అయింది పిన్నీ!"

"ఏటో గెహసారం! నాను కూకొని నీసేత సేపించుకుంతన్నాను"




"మరేం పర్వాలేదు! ఒక్కవారం రోజులు వోపికపడితే నువ్వే మళ్లీ వంట చేసి దారిన పోయేవారిని పిల్చిపెడతావు" అంది లత నవ్వుతూ.

"మా పిన్ని యింత వరకూ యింజక్షన్ చేయించుకొని ఎరగదు. అటువంటిది ఏకంగా కంటాపరేషన్ అనగానే భయం పట్టుకొంది"

"భయమెందుకు మామ్మగారూ! నేను ఆపరేషన్ సమయంలో మీ ప్రక్కనే వుంటాను" అని ఆమె చేయి పట్టుకొని -" కంటి ఆపరేషన్ అంటే కత్తులతో నెత్తురొచ్చేలా కొయ్యడం కాదండి! సాధారణంగా వయస్సు ముదురుతూంటే కంట్లో నల్లగుడ్డు మీద పల్చటి పొర ఏర్పడుతుంది. కళ్లు పొరలు కమ్మేయా! అంటాం కదా దీనినే. ఆ పొర వల్ల చూపు మందగిస్తుంది. దానిని తొలగించి చూపు సరిచేస్తారు. కంట్లో పొర తొలగించడానికి అరనిముషం పడుతుంది! అంతే" అంది మంజుల.

"నా తల్లే సక్కగా యిడమరిసి సెప్పేవు! సచ్చినీకడుపున పుడతా!"

"ఆ పని మాత్రం చెయ్యకండి! మీలాంటి వారు పదికాలాల కాలం ఆరోగ్యంగా వుండాలి" అంది నవ్వుతూ.

"డాట్టరమ్మకు తొల్త బువ్వెట్టి! అయినాక మనం తిందాం" అంది ఆదిలక్ష్మి.

"నాకు తొందరలేదండీ! ఆనక అందరం ఒకే మారు తినొచ్చు" అంది మంజుల.

మరొక అరగంట తరువాత అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేసేరు.

మర్నాడుదయం ఆదిలక్ష్మిని తనతో హాస్పటల్‌కి తీసుకొని వెళ్లింది మంజుల. కూడా ధర్మయ్య, లత వెళ్లేరు.

లయన్స్ క్లబ్ వారు ఏర్పాట్లు ఘనంగానే చేసేరు. గేటు ముందు బేనర్లు కట్టేరు. హాస్పటల్ ఆవరణలో పెద్ద షామియానాలు వేసి అందులో కుర్చీలు వేసేరు.

మంజుల డ్యూటీలో జాయిన్ అయిన తరువాత ఆపరేషన్లు చెయ్యడానికి వైజాగ్ నుండి వచ్చిన డాక్టర్లకు ఆదిలక్ష్మిని పరిచయం చేసింది. ఆవిడ కేసే మొదట టేకప్ చేసేరు. మంజుల ఆదిలక్ష్మి ప్రక్కనే వున్నందున ఆవిడ కాస్త ధైర్యంగానే వుంది. యిప్పుడు ఆవిడ దృష్టి బాగుపడి స్పష్టంగా అన్నీ చూడగల్గుతోంది.

వెలిడిక్టరీ ఫంక్షన్‌కి చుట్టు ప్రక్కలగ్రామ పెద్దలేగాక పట్నం నుంచి పురప్రముఖులు కూడా వచ్చేరు. వేదిక మీద లయన్స్ క్లబ్ గవర్నరు, క్లబ్ ప్రెసిడెంట్, డి.ఎమ్.ఓ., డాక్టర్లు వున్నారు. మీటింగ్ ప్రారంభం అవగానే లయన్స్‌క్లబ్ గవర్నర్ మైకు ముందుకు వచ్చి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించి "యీ రాంవరం హాస్పటల్‌కి ఎంతో ప్రాముఖ్యం వుంది. యీ హాస్పటల్ నిర్మాణానికి 5 ఎకరాల స్థలం, లక్ష రూపాయల విరాళం యిచ్చిన దానశీలురు శ్రీ ధర్మయ్యగారు యీ సభలో వున్నారు. వారిని సగౌరవంగా వేదిక మీదకు తీసుకొని రావల్సిందిగా నా కోరిక." అన్నారు.


లయన్స్ క్లబ్ మెంబర్స్ ధర్మయ్యగారిని బలవంతంగా తీసుకొని వెళ్లి వేదిక మీద కూర్చుండబెట్టేరు. లయన్స్‌క్లబ్ గవర్నరుగారు వారిని పూలమాలతో సత్కరించి-"దానధర్మాలు చెయ్యడంలో భర్తకు ఏమాత్రం తీసిపోరు ధర్మయ్యగారి సతీమణి ఆదిలక్ష్మిగారు. వారిని కూడా వేదిక మీదకు తీసుకొని రావల్సిందిగా నా కోరిక" అన్నారు.

డాక్టరు మంజుల, లత ఎంతో బలవంతంతో ఆదిలక్ష్మిని వేదికమీద కూర్చోబెట్టేరు. లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ కనకవల్లి గారు ఆమెను పూలమాలలతో సత్కరించేరు.

ధర్మయ్యగారు, ఆదిలక్ష్మిగారి కళ్లల్లో ఆనందం కన్నీళ్ళరూపంలో బయటికొచ్చింది. వారి ధర్మనిరతికి సభాసదులు, ప్రేక్షకుల చప్పట్లు మిన్నుముట్టాయి.

★

## సంజయ్ సంబరం!



సంజయ్ దత్‌కి మొదటి భార్య, సినీ తార రిచాశర్మ ద్వారా కలిగిన కూతురు విషయంలో అమెరికాలో జరుగుతున్న కోర్టు యుద్ధం ఇప్పుడో కొలిక్కి వచ్చేసిందిట. ఇంతకాలం తమ మనవరాల్ని సంజయ్ చూడకూడదని, ఆమె మంచి చెడుల నిర్ణయాల విషయంలో తండ్రిగా సంజయ్ జోక్యం అవసరం లేదని అమెరికన్ కోర్టులో కేసు వేసిన రిచా తల్లిదండ్రులు ఇప్పుడు ఆ కేసుని విత్‌డ్రా చేసుకుని కోర్టుకన్నా కోర్టు బయటే ఈ సంగతిని ప్రశాంతంగా పరిష్కరించుకోవాలని అనుకుంటున్నట్టు సంజయ్‌కి కబురు పంపడంతో సంజయ్‌దత్ తెగ సంతోషపడుతున్నాడు. 'నేనూ మనిషినే! అనారోగ్యంతో మృత్యువాత పడిన నా రిచాకు గుర్తుగా నిలిచిన నా కూతురు 'త్రిషాలా' విషయమై ఇక నాకు ఎలాంటి ఆంక్షలు లేవనే సంగతి తల్చుకుంటే నాకెంతో ఆనందంగా వుందో' అంటున్నాడు గతంలో కంటే ఇప్పుడు ఎంతగానో మారిపోయిన సంజయ్ దత్.

-జె.ఎం.